నవతెలంగాణ

1

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | డిసెంబర్ 17, 2023 | www.navatelangana.com

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుండెపోటుతో మృతి



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన తమ్మే వార్ భగవాన్ శనివారం ఉదయం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఆయన.. ఆకస్మాత్తుగా మృతిచెందడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకునిగా ఎదగడం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండటంతో ఆయన మృతి పట్ల ప్రతి ఒక్కరు విచారం వ్యక్తపరిచారు. కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయిందని పలువురు తమ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రమాదం జరిగితే తప్పా.. పట్టదా..?



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని సుల్తాన్ నగర్ బొగ్గు గుడిసే మధ్యలో గల నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ కల్వర్టు భాగం కూలిపోయింది. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెన కింద ఎప్పుడు నీరు పారుతూ ఉంటుంది. నిజాంసాగర్ నుండి ఎల్లారెడ్డి వైపు వెళ్లాలంటే ఇదే ప్రధానమైన మార్గం. కానీ ఈ మార్గం గుండా వెళ్లాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకుండే మేల్కొని కల్వర్టు నిర్మించాలని వారు కోరుతున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో

క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- కామారెడ్డిలో రాష్ట్ర స్థాయి హాకీ క్రీడాపోటీలు ప్రారంభం



ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడానికి విద్యాశాఖ, ఎస్‌జీఎఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రస్థాయి క్రీడాకారులకు ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా క్రీడాకారులు, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడ కోటాలో ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. గతంలో భారతదేశం హాకీ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉండేదని తెలిపారు. తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి క్రీడాకారులు నిరంతరం ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు కామారెడ్డిలో నిర్వహించడానికి అధికారులు అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి హాకీ పోటీల నిర్వహణకు సహకారం అందించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో హాకీ పోటీల్లో రాణించాలని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో ఓటమి చెందిన వారు అసంతప్తికి లోను కావద్దని, నేటి ఓటమి రేపటి గెలుపు నకు నాంది పలుకుతోందని తెలిపారు. పది ఉమ్మడి జిల్లాలకు చెందిన 405 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నట్లు ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్ తెలిపారు. మండల స్థాయి, జిల్లాస్థాయి క్రీడల నిర్వహణకు ఎమ్మెల్యే సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా యువజన, క్రీడల సంక్షేమ అధికారి దామోదర్ రెడ్డి, కౌన్సిలర్లు నరేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు

అధికార పార్టీలోకి దూకేద్దామా.?

- పలు పార్టీల నాయకుల సమాలోచనలు
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన పలువురు



నవతెలంగాణ-మద్నూర్

ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. అయితే అధికారమే పరమావధిగా ఇతర పార్టీలలోని పలువురు నాయకులు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం మంతనాలు సాగిస్తున్నారు. ఇది వరకే పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. మరికొంత మంది అదే బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల అనంతరం జుక్కల్ నియోజకవర్గంలో రాజకీయ ముఖ చిత్రం పూర్తిగా మారుతోంది. ఇన్ని రోజులు బీఆర్ఎస్ వెంట ఉన్న నాయకుల్లో పలువురు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. డోంగ్లి మండల పరిధిలోని మద్నూర్ మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అలాగే మాజీ ఎంపీటీసీ హైమద్ హుస్సేన్ బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కపాడుకుంటానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తాజా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఇది వరకే ప్రకటించారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గం స్థాయిలో కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తూ అధికారం కోల్పోతే భయపడేది లేదని నాయకులకు, కార్యకర్తలపై ఈగ కూడా వాలనివ్వనని అభయం ఇచ్చారు. పార్టీకి జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నట్టు తెలిపారు. అయినా పలువురు మాత్రం అధికారంలో ఉన్న పార్టీ వైపు చూస్తున్నట్టు సమాచారం.

సహకార సంఘం పాలకవర్గం సమావేశం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్ (లింగంపేట్)

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ కిచెన్నపేట సహకార సంఘం పాలకవర్గం సమావేశం శనివారం తాండూర్ కిచ్చన్నపేట నందు సంఘం అధ్యక్షులు ఆకిడి గంగారెడ్డి అధ్యక్షతన నేడు పాలక వర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. సంఘం కార్యదర్శి జైపాల్‌రెడ్డి గారు సంఘ లావాదేవీలను వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్ష అరవై ఒక్క వేల ఒక్క వంద డెబ్బై ఒక్క క్వింటాల్ల దాన్యాని కొనుగోలు చేసినట్లు తెలియచేయగా పాలకవర్గ సభ్యులు రబీ సీజన్‌కి సరిపడా ఎరువులను రైతులకు అందేవిధంగా అందుబాటులో ఉంచాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిద్దె బాబురావు, డైరెక్టర్లు వేముల సంగయ్య, భూమ స్వరూప, చెవుల లక్ష్మి, పోలేపల్లి పాపమ్మ కొరబోయిన విజయ్ కుమార్, వి సిద్దిరామ్‌రెడ్డి, చిటకుల గోపాల్, హనుమా నాయక్, బస్సీ నాయక్, కిషన్ నాయక్, జయరాజు, సిబ్బంది చంద్ర మురళి పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశం

సమగ్ర సమాచారం ఉండాలి

- బూత్ లెవల్ అధికారులతో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

బూత్ లెవల్ అధికారుల వద్ద సమగ్ర సమాచారం ఉండే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఏఆర్ఓల మాస్టర్ ట్రేనర్ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. బూత్ లెవెల్‌లో ఉన్న ఓటర్ల సంఖ్య, పురుషులు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ ఎంతమంది ఉన్నారనే వివరాలు ఉండే విధంగా చూడాలని సూచించారు. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు బూతు లెవల్ అధికారుల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లు లేకుండా చూడాలన్నారు. ఓటర్ జాబితాలో ఒక వ్యక్తి పేరు రెండు చోట్ల ఉంటే వారి నుంచి డిక్లరేషన్ తీసుకొని ఒక పేరును తొలగించాలని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేసి, ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందారా, అనారోగ్యంతో మృతి చెందారా, సాధారణంగా మృతి చెందారా అనే వివరాలు పొందపరచి మృతి చెందిన వ్యక్తి పేరును జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోలు రిజిస్టర్ ఏర్పాటు చేసుకొని వాటిలో సమగ్ర వివరాలు రాసుకునే విధంగా ఏఆర్వోలు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నారైలు 6 (ఎ) లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు ఫారానికి పాస్‌పోర్ట్ జతచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రేనర్స్ హిమ బిందు, శివ ప్రసాద్ ఏఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఎన్నికల సూపరిండెంట్ ప్రేమ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు లబ్దిదారులకు చేర్చాలి

- వికాస్‌భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యం అదే
- జిల్లా నోడల్ అధికారి, భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ అశ్విని శ్రీవాత్సవ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ అశ్విని శ్రీవాత్సవ్

నవతెలంగాణ-కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అట్టడుగు వర్గాల స్థాయికి చేరుకోవాలన్నదే వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని జిల్లాకు నోడల్ అధికారిగా నియమించిన భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ అశ్విని శ్రీవాత్సవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాధామ్య పథకాలను అర్హులైన లబ్ధిదారుల చెంతకు తీసుకు వెళ్ళడమే కాకుండా, కొత్త లబ్ధిదారుల గుర్తింపులో భాగంగా దేశ వ్యాప్తంగా ఈనెల 16 నుండి జనవరి 26 వరకు వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర అనే అవగాహన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకు భారత ప్రధాని నరేంద్ర మోడి వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం జిల్లాకు చేరిన 7 ప్రచార వాహనాలను కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు మౌలిక సదుపాయాలైన పారిశుద్ధ్యం, ఆర్థిక సహాయం, ఎల్పీజీ కనెక్షన్లు, ఇండ్లు, ఆహార భద్రత, పౌష్టికాహారం, వైద్యం, విద్య, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, ఇట్టి కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అవగాహన కల్పించడంతో పాటు కొత్త లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా అవగాహన కల్పించేందుకుగాను ఈ కార్యక్రమాన్ని భారత ప్రభువం చేపట్టిందని అన్నారు.

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 7 (ఐఈసి, విఎస్ఎస్) ప్రచార రథాలు వచ్చాయని, వాటి ద్వారా జిల్లాలో నేటి నుండి 25 జనవరి 2024 వరకు ప్రతి రోజు 7 మండలాలలో ప్రతి మండలంలో 2 గ్రామాల చొప్పున జిల్లాలోని 526 గ్రామా పంచాయతీలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విధంగా వాహనం వారీగా రూట్ మ్యాప్, కార్యాచరణ రూపొందించామన్నారు. అట్టి వాహనాలలో ప్రధాన మంత్రి సందేశం ఆడియో వీడియోతో పాటు ఎల్.ఈ.డి. స్క్రీన్స్ ద్వారా గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధామ్య పథకాలైన ఆయుష్మాన్ భారత్- పిఎంజెఏవై, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్నా యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, పీఎం విశ్వకర్మ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కే సి సి), పీఎం పోషన్ అభియాన్, హర్ ఘర్ జల్-జల్ జీవన్ మిషన్, సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజెస్ ఏరియాస్, జన్ దన్ యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పియం ప్రణాం , నానో ఫెర్టిలైజర్ తదితర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అవగాహన కల్పించడంతోపాటు ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే వారు తమ పేరును నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాల విజయవంతానికి మండలానికి నోడల్ అధికారులను నియమించడంతో పాటు సంబంధిత శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై కరపత్రాలు, పుస్తకాలు ప్రజలకు అందజేసి ప్రభుత్వ పథకాలపై అభిప్రాయాన్ని సేకరిస్తారన్నారు. ప్రజలు ఇట్టి క్యాంపులకు హాజరయ్యేలా గ్రామ కార్యదర్శులు గ్రామాలలో చాటింపు వేయాలని, కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు విజయవంతం చేసేందుకు సహకారం అందించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించాలని, ఆయా పథకాలలో ఏ విధంగా లబ్ది పొందుతున్నారు, ఏ విధమైన లాభం జరుగుతుందన్నదన్నది లబ్దిదారుల వ్యక్తిగత అనుభవాలను అందరితో పంచుకునేలా చూడాలన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చి ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. సంకల్ప్ యాత్ర విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఐటీ ప్లాట్ ఫామ్‌లలో ప్రి-ఈవెంట్ సమాచారాన్ని అప్లోడ్ చేయాలని కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రత్నాబాయ్ ఆనంద రావు ,లీడ్ బ్యాంక్ అధికారి భార్గవ్ కుమార్, జెడ్పి సీఈఓ సాయ గౌడ్, డి ఏం అండ్ హెచ్ ఓ లక్ష్మణ్ సింగ్, పౌరసరఫరా అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల డిస్ట్రిక్ట్ మేనేజర్ అభిషేక్ సింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలా శాతం పెంపొందించాలి

- జిల్లా డిఆర్‌డిఏ ఫైనాన్స్ అధికారి రాం నారాయణ

నవతెలంగాణ-పిట్లం

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీలో కూలీల శాతం పెంచాలని జిల్లా డి ఆర్ డి ఏ ఫైనాన్స్ అధికారి రామ్ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న చెరువు కెనాల్ , పిట్లం నర్సరీ పనులను పరిశీ లించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చిన ఫీల్డ్ అసిస్టెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న నర్సరీ , ఆయా పనులలో 50 మంది లేబర్ కంటే తక్కువ కాకుండా చూడాలని అన్నారు. నర్సరీలలో లోకల్ విత్తనాలు సేకరించి మొలకెత్తెలా ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది హర్నిశల కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఉపాధి హామీ ఏపీవో శివ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ సెక్రటరీ యాదగిరి , టిఏ, సిఓలు పాల్గొన్నారు.



నర్సరీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఫైనాన్స్ అధికారి

ఆరుతడి పంటలకు లద్దెపురుగు

- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించిన ఏవో



నవతెలంగాణ-మద్నూర్

ప్రస్తుతం రబీ పంటల సాగులో భాగంగా ఆరుతడి పంటలకు పొగాకు లద్దెపురుగు సోకుతుం దని, దాని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాల ని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మద్నూర్ ఉమ్మడి మండలంలో పొద్దు తిరుగుడు, పెసర, మి నుము, శనగ తదితర పంటలు ప్రధానంగా సాగవు తున్నాయి. అయితే గత వారం రోజుల నుండి నెల కొన్న వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల పంట లపై పొగాకు లద్దె పురుగులు ఉధృతంగా ఆశించి పంటలను నష్టం కలగజేస్తున్నట్లుగా వ్యవసాయాధి కా రులు గుర్తించారు. వాటి నివారణకు వ్యవసా యాధికా రులు పలు సూచనలు తెలియజేశారు.

పగటి ఉష్ణోగ్రతలు 30 నుండి 32 సెల్సియస్ అలాగే రాత్రి ఉష్ణోగ్రతలు 21 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా నమోదైనప్పుడు ఈ పురుగు ఉధృతం పెరగడానికి దోహదపడుతుందని సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవలసిన జాగ్రత్తలను మండల వ్యవసాయ అధికారి రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రైతులు నత్రజని ఎరువులను అధికంగా వాడొద్దు. సిఫార సు చేసిన మోతాదులోనే వాడుకోవాలి. గుడ్ల సముదాయాలను, జల్లెడగా మారి పిల్లా పురుగులతో ఉన్న లార్వాలను ఏరి నాశనం చేయాలి. ఎకరానికి నాలుగు నుండి ఐదు లింగ కర్షక బుట్టలను అమర్చాలి. వీటిని ప్రతి 50 మీటర్ల దూరానికి ఒకటి చొప్పున మొక్కలకంటే ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవాలి. లింగకర్షక బుట్టల మందులని ప్రతి 20 రోజులకు ఒకసారి మార్చుకోవాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు విషపు ఏరా ముద్దలు వెదజల్లుకోవాలి. విషపు ఏర తయారీకి మోనోక్రోటోఫాస్ లేదా క్లోరోఫెరీఫాస్ 500 మిల్లీలీటర్లు ఐదు కిలోల తౌడు మరియు ఆధా కిలో బెల్లం సరిపడే నీటిలో కలిపి చిన్న ఉండలుగా చేసి సాయంకాలం సమయంలో వెదజల్లుకోవాలి. చివరగా 50 శాతం పంట నష్టం గమనించినట్లయితే స్ప్రే నో సాడ్ 0.3 మిల్లీలీటర్లు లేదా హిమ మెక్ టిన్ 0.5 గ్రాములు లేదా నోవాల్యూ రాన్ ఒక మిల్లీలీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఎదిగిన లార్వాలా ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే కోరంతానిలిప్రోలు 0.3 మిల్లీ లీటర్లు లేదా ఫ్లూబెండమయిడ్ 0.2 మి లి లీటరు నీటికి కలిపి పిచికారి చేసి పెద్దపురుగులను నివారించుకోవచ్చు' అని తెలిపారు. ఈ విధమైన సూచనలు వ్యవసాయ రైతులు పాటిస్తే లద్దె పురుగు పూర్తిస్థాయిలో నివారించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రాజు ఒక ప్రకటన ద్వారా రైతులను కోరారు.

ఆలయానికి విరాళాలు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతిరెడ్డిపల్లి వీరాంజనేయ నూతన ఆలయ భూదానం నిమిత్తం శనివారము భారీగా విరాళాలు అంద చేసినట్లు ఆలయ పూజారి తేజ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన గాండ్ల లక్ష్మణ్ రాము 5 వేల ఒక వంద రూపాయలు , వంశీకృష్ణ 11 వేల ఒక వంద రూపాయలను విరాళముగా అందజేయగా కారేగాం గ్రామానికి చెందిన జగురియా 2 వేల ఒక వంద రూపాయలను విరాళముగా అందజేసినట్లు తెలిపారు. అనంత ˊరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తాదులు పాల్గొన్నారు.



ఆలయానికి విరాళం అందజేత

నవతెలంగాణ

2

నిజామాబాద్

ఆదివారం | డిసెంబర్ 17, 2023 | www.navatelangana.com

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో పాఠశాల విద్యార్థులకు "మాక్ పోలింగ్" ఎలక్షన్ నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఎలక్షన్ నిర్వహణపై, ఓటింగ్‌లో పాల్గొనే విధానం తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు ఉత్సహంతో ఈ ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, డైరెక్టర్ నర్సయ్య, పాఠశాల అధ్యాపక బృందం రాజేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎంపీడీవో, టివిఎస్ గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని బర్దిపూర్ గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను సర్పంచ్ నీరడి సృజన, ఎంపీడీవో టివిఎస్ గోపి బాబు చేతుల మీదుగా విడుదల చేశారు. దీక్షిత్ భారత్ సంకల్పయాత్ర సంబంధించిన వివరాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంతోష్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, నీరడి పద్మారావు, గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం కబ్జాకు యత్నం

• అడ్డుకున్న వడ్డెర కాలనీవాసులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని గాంధీనగర్ వడ్డెర కాలనీకి చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని శనివారం ఒక కులానికి చెందినవారు కబ్జా చేయడానికి యత్నించారు. జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో శ్మశాన వాటిక స్థలాన్ని చదును చేసేందుకు ప్రయత్నిస్తుండగా వడ్డెర కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఇరువర్గాల వారు ఒకరినొకరు తోసేసుకున్నారు. గాంధీనగర్ కాలనీలో ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిక గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. అయితే గ్రామానికి చెందిన ఒక కులం వారు శ్మశాన వాటిక స్థలం తమదని, ఆ స్థలానికి సంబంధించిన పట్టా ఉందంటూ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా కాలనీవాసులు అడ్డుకోవడంతో అప్పటినుండి ఈ విషయమై ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతుంది. ఇరువర్గలవారు ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది వివాదాస్పద స్థలాన్ని సర్వే చేసి హద్దులు కూడా పాతించారు. అయితే శనివారం మరో మారు ఒక వర్గం వారు జెసిబి, ట్రాక్టర్ల సహాయంతో శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకొని చదును చేసే పనులు మొదలుపెట్టారు. అప్పటికే శ్మశాన వాటిక స్థలంలో ఉన్న మూడు సమాధులను జెసిబి సహాయంతో తవ్వి ఎత్తిపోశారు. విషయం తెలుసుకొని వడ్డెర కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఈ వర్గాలవారు వాదులడుకోవడం, ఒకరినొకరు తోసేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పలువురు పెద్దలు అక్కడికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. ఎవరికి వారే అధికారులతో తేల్చుకుంటామని అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది.



పనులను అడ్డుకుంటున్న వడ్డెర కాలనీవాసులు

టిజియుఎస్ జిల్లా అధ్యక్షులుగా జాదవ్ సంతోష్ నాయక్



నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జాదవ్ సంతోష్ నాయక్‌ను నియమించారు. రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాకు చెందిన యాదవ సంతోష్ నాయక్, డిచ్‌పల్లి మండలం బిబి తాండకు చెందిన బానోత్ దేవిసింగ్‌ను రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్ నియమించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బెస్ట్ కరస్పాండెంట్‌గా అవార్డు



అవార్డును అందుకుంటున్న రామకృష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ బెస్ట్ కరస్పాండెంట్‌గా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసేర్చ్ వారు ద బెస్ట్ కరస్పాండెంట్ అవార్డును అందజేశారు. అందులో భాగంగా శనివారం లిల్లీపుట్ పాఠశాలలోని కరస్పాండెంట్ రామకృష్ణ దీనికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని కరస్పాండెంట్ రామకృష్ణకు ఈ అవార్డు రావడం చాలా సంతోషకరంగా ఉందని కరెస్పాండెంట్ రామకృష్ణను సన్మానించారు.

బాలబాలికలకు క్యాంపస్ వసతి గృహాలను నిర్మించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సరిపడా బాల బాలికల క్యాంపస్ హాస్టల్స్ (వసతి గహాలను) నిర్మించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యు. నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ అదనపు జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. నగర అధ్యక్షులు ఎస్కే అషఉర్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు నిజామాబాద్ నగర కేంద్రంగా ఉన్న ప్రభుత్వ గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాలకు చదువు నిమిత్తమై వస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలకు సంబంధించి వేలాదిమంది విద్యార్థులు చదువుల నిమిత్తమై ఉన్నారన్నారు. కానీ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు సరిపడా హాస్టల్ వసతి లేకపోవడం బాధాకరమన్నారు. చాలామంది విద్యార్థులకు వసతిగహం దొరకలేనందున, ఆర్థిక భారంతో పైచదువులకు దూరమయ్యారన్నారు. కేవలం ప్రభుత్వ గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాల సంబంధించిన విద్యార్థులే దాదాపు పదివేలకు ఉంటారని తెలిపారు. గిరిరాజ్, పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ వసతి గహాలను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్యాంపస్ వసతిగహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిర్మించబడ్డ బాల, బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతి గహాలను త్వరితగతిన ఉపయోగంలోకి తేవాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.యస్.యు పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన కార్యదర్శి కే.తిరుమలేష్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నాయకులు నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా గంట అశోక్



నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

గత 7 సంవత్సరాలుగా పిఆర్‌టియు టిఎస్ వేల్పూర్ మండల అధ్యక్షులుగా ప్రధాన బాధ్యతలు నిర్వహించి మండలంలో సంఘాన్ని పటిష్టపరిచిన గంట అశోక్ సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా గంట అశోక్ మాట్లాడుతూ.. గత 7 సంవత్సరాలలో తనకు సహాయ సహకారాలు అందించిన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర గౌడ్, గౌరవ అధ్యక్షులు శంకర్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణ్ పటేల్, మండల విద్యాశాఖ అధికారులు లింగ మూర్తికి, వనజరెడ్డికి తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు మురళీ, కాంతయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందుంటానని అన్నారు.

అయ్యప్ప స్వాముల ఆరట్టు శోభయాత్ర

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని పెద్దవాల్గొట్ గ్రామంలో అయ్యప్ప స్వాములు ఆరట్టు శోభయాత్రను శనివారం నిర్వహించారు. ఈ శోభయాత్రలో గ్రామంలోని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



అసభ్యంగా ప్రవర్తిస్తే..

షీటీమ్‌కు సమాచారం ఇవ్వండి

నవతెలంగాణ-ఆర్మూర్

ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్ టీజింగ్ చేసినా షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల విగ్నేష్, సుమతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవింద్‌పేట్‌లో సైబర్‌క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినీల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈవ్‌టీజింగ్‌కు గురయ్యే వారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఇంద్ర, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో సృజనాత్మకత వెలికి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు విజయానందరావు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు సివి రామన్ జయంతి పురస్కరించుకొని విశ్రాంత ఉపాధ్యాయులు విజయానందరావు ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు ఈ క్రీడా పోటీలను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, సైన్స్‌కు సంబంధించిన క్విజ్ పోటీలను నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. రంగోలి, క్విజ్, పాటలు, తదితర క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, పీఆర్‌టీయు మండల అధ్యక్షులు సోమలింగంగౌడ్, రాజేందర్‌రావ్, ఉపాధ్యాయులు రాజేందర్‌సింగ్, శ్రీనివాస్, ఆనంద్, గోవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని

బి.ఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించని బి.ఎడ్ కళాశాలపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల నుండి అధిక ఫీజుల దోపిడీకి పాల్పడుతూ, నిబంధనలు పాటించని ఆయేషా(నిజామాబాద్), ప్రియదర్శిని(ఆర్మూర్), శ్రీ రాఘవేంద్ర (ఆర్మూర్), అహ్మేద్ (భిక్కనూర్), కర్షక్ (కామారెడ్డి), శ్రీసాయి, కెఆర్ఆర్ (నిజామాబాద్) బి.ఎడ్ కళాశాలలపై ఎందుకు యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బి.ఎడ్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా మేనేజ్మెంట్ సీట్లు ఒక్కో సీటు లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. అడ్మిషన్ ఫీజుకు పదివేలు, అటెండెన్స్, ల్యాబ్‌లకు వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని, 16 మంది ఫుల్ టైం ఫ్యాకల్టీకి గాను ముగ్గురు నలుగురితో మెయింటెనెన్స్ చేస్తున్నారని అన్నారు. కన్వీనర్ కోటాలో సీటు వచ్చిన వారి దగ్గర నుంచి రెండు సంవత్సరాల ఫీజు మొత్తం మొదటి సంవత్సరం లోనే కట్టించుకుంటున్నారని, పరీ క్షల ఫీజులు యూనివర్సిటీ చెప్పిన దానికంటే అధికంగా తీసుకుంటు న్నారని, కాలేజీలలో కనీసం ల్యాబ్, లైబ్రరీ, సెమినార్ హాల్స్ లేవని, జిల్లా కేంద్రంలో స్కూల్ పర్మిషన్ బిల్డింగ్‌లో బీఎడ్ క్లాసులు నిర్వహిస్తున్నారని, కావున నిబంధనలు పాటించని బి.ఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయ కులు మనోజ్, రవీందర్, ఆకాష్, మోహిత్, హన్మాం డ్లు, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



సంకల్ప యాత్రను కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్‌తాండ గ్రామంలో విక్షిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ సంకల్ప యాత్రను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రధానమైన 5 శాఖలకు సంబంధించిన అంశాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు రెండు గ్రామాలు చొప్పున స్క్రీనుపై చూయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్, ఎంపీడీవో శంకర్, నోడల్ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనరసయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వట్లూరి శ్రీనివాస్, ఇన్చార్జి తహసీల్దార్ శశి భూషణ్, డాక్టర్ వినయ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, భాస్కర్, శ్రావణ్ కుమార్, శరత్చంద్ర, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పిట్ల ఎల్లన్న స్ఫూర్తితో పోరాడాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/సిరికొండ

కామ్రేడ్ పిట్ల ఎల్లన్న ఉద్యమస్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. పిట్ల ఎల్లన్న 32వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఆర్ భవన్‌లో నివాళులు అర్పించారు. అనంతరం వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. కామ్రేడ్ పిట్ల ఎల్లన్న వ్యవసాయ కూలీలకు కూలీరేట్లు పెంచాలని, తునికాకు రేట్లు పెంచాలని, గిట్టుబాటు ధరలు ఇవ్వాలని పోరాటం చేశారని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసి పోరాటంలో విజయం సాధించడాని, కష్ట జీవుల రాజ్యం కోసం పరితపించాడని వివరించారు. ఎల్లన్నకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను తట్టుకోలేక కొందరు అతివాదులు ఎల్లన్నను హతమార్చారని తెలిపారు. ఎల్లన్న పోరాట స్ఫూర్తి ప్రతి కార్యకర్త అలవర్చుకోవాలని తెలిపారు. నేడు దేశంలో పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వటం లేదని రైతుల వ్యతిరేక విధానాలను తీసుకువచ్చి వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్రలు మోదీ ప్రభుత్వం చేస్తుందని, కావున ఎల్లన్న పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జెల్లా మురళి, శివకుమార్, బండమీద నర్సయ్య, వనమల సత్యం, రమేష్, జన్నారపు రాజేశ్వర్, రాజు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలోని గడ్కోలు గ్రామంలో కామ్రేడ్ పిట్ల ఎల్లన్న వర్ధంతి సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జెండా ఎగరవేశారు. అనంతరం గ్రామశాఖ అధ్యక్షులు గులాం హుస్సేన్ మాట్లాడుతూ.. పిట్ల ఎల్లన్న భారత దేశంలో దోపిడి పీడన లేని రాజ్యం కోసం పని చేస్తున్న క్రమంలో 32 సంవత్సరాల క్రితం అకారణంగా కాల్చి చంపారని తెలిపారు. వర్గ దక్పథాన్ని విస్మరించి కామ్రేడ్ ఎల్లన్నను చంపి న్యూడెమోక్రసీని దెబ్బతీశామని భ్రమపడ్డారని, కానీ వాళ్లే కనుమరుగయ్యారని చెప్పారు. నేడు భారతదేశంలో మోడీ ఫాసిస్టు విధానాలతో అనేక సమస్యలను ఎదుర్కొంటుందని అన్నారు. అనంతరం నిమ్మల భూమేష్ మాట్లాడుతూ.. ఎల్లన్న ప్రజల్లో ఉండే వ్యక్తి, ప్రజలతో మమేకమై ఉద్యమాలు సాగించిన వ్యక్తి ఆయన ఎదుగుదలని ఓర్వలేని కొందరు ఆయన్ని భౌతికంగా దూరం చేయగలిగారే తప్ప ఆయన ఆశయాలను చంపలేకపోయారని అన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, పిట్ల మార్క్స్, ఎంపిటిసి తలారి గంగారాం, కష్ణ, శివరాజ్, నరసగౌడ్, మాల రాములు, రామాగౌడ్, చాకలి చిన్న గంగాధర్, గాడే నర్సయ్య, పివైఎల్ మండల అధ్యక్షులు మల్కి సంజీవ్, సాయికుమార్, సుద్దపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కామ్రేడ్ పిట్ల ఎల్లన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

విద్యా హైస్కూల్, భార్గవి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్య హైస్కూల్, మండలంలోని అంకాపూర్ భార్గవి విద్యానికేతన్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు రోటేరియన్ చంద్రశేఖర్ సక్సెస్‌పై ఆలోచన నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలని వ్యక్తిగత వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి లక్ష్యాన్ని సాధించాలి, ఎలా పట్టుదలతో ముందుకెళ్లాలనే అంశాలను సూచించారు. అంకాపూర్ భార్గవి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి, డైరెక్టర్ ప్రవీణ్ పవార్, గోపి కృష్ణ, రోటరీ సెక్రెటరీ జలంగి పట్వారి చంద్ర శేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారని పక్కా సమాచారంతో శనివారం దాడి చేసి బియ్యం పట్టుకున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. నిలువ ఉంచారని పక్క సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య మహిపాల్ ఇంట్లో 7.60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని మహిపాల్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.


బియ్యం పట్టివేత

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రయివేటు బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెర్కిట్ సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న చేపూర్ గ్రామానికి చెందిన తథామస్తుల రమేష్ (65) రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.


మృతిచెందిన రమేశ్

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఎం.పీ ధర్మపురి అరవింద్
- లక్కోర నుండి లాంఛనంగా ప్రారంభం
- పాల్గొన్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

నవతెలంగాణ-వేల్పూర్

కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామం నుండి శ్రీకారం చుట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ సెకండరీ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు అరవింద్ ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి సంకల్ప యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో గల చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధతో పూజించారు.

కాగా, జిల్లాలోని మొత్తం 530 గ్రామ పంచాయతీల పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక వాహనాలను సమకూరుస్తూ, 7 బృందాలను ఏర్పాటు చేసింది. ప్రతీ రోజు ఒక్కో బృందం రెండు నుండి మూడు గ్రామాలలో సంకల్ప యాత్ర ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యపర్చేలా నిర్విరామంగా ఈ కార్యక్రమం యాభై రోజులకు పైగా కొనసాగేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ రవింద్, అధికారులు

ఇందులో భాగంగా శనివారం లక్కోర గ్రామం నుండి శ్రీకారం చుట్టిన సంకల్ప యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎం.పీ అరవింద్ తో పాటు అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అరవింద్ మాట్లాడుతూ, అర్హత కలిగిన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద సహాయం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి లిమిట్ లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి, భారతీయ పౌరసత్వం కలిగిన ప్రతి పౌరుడికీ కేంద్ర పథకాలు అందాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఈ దిశగా జిల్లాలో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్ర మాన్ని గ్రామగ్రా మాన విజయ వంతం చేస్తూ, అర్హులైన వారం దరూ సద్విని యోగం చేసుకో వాలని పిలుపుని చ్చారు. ఉజ్వల భారత్, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్రా యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి పథకాల కింద అర్హత కలిగిన వారు సంకల్ప యాత్ర సందర్భంగా దరఖాస్తులు చేసుకోవచ్చని, తరువాత కూడా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తులు అందించవచ్చని సూచించారు.

కాగా, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం కింద ప్రతి పంచాయతీకి ప్రత్యేక వాహనంతో కూడిన బృందాలను పంపి 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు, భూసార పరీక్షా ఫలితాల నిర్ధారణ కార్డులను వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్, ఉజ్వల భారత్, ఐసిడిఎస్ స్టాల్స్ లను ఎం.పీ పరిశీలించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందిన పలువురు లబ్ధిదారులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి అధికారులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా నానో ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వ్యవసాయ అధికారులు నొక్కి చెప్పారు. అంతకుముందు వికసిత్ భారత్ సంకల్పయాత్రను వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తన సందేశాన్ని అందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు.


జెండా ఊపి రథన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అరవింద్

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ చందర్ నాయక్, డీపీఓ జయసుధ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు, డీఈఓ దుర్గాప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం, డీఐఈఓ రఘురాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, నాబార్డు డీ.డీ.ఎం ప్రవీణ్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ రాకేష్, డీఎల్పీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నాగార్జున, సర్పంచ్ వంశీకృష్ణ, ఎంపీటీసీ గంగామణి, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాకతీయ కాలువకు రేపటి నుంచి నీటి విడుదల

- వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారుల విజ్ఞప్తి


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

నవతెలంగాణ-నిజామాబాద్

ఎస్సారెస్పీలోకి కాకతీయ కాలువ(లోయర్ మానేరు డ్యాంపైన) పరిధిలోని ఆయకట్టు రైతులకు ఈ నెల 18వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్టు ఎస్ఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి ఏడు రోజులు డిస్ట్రిబ్యూటరీ 53 (జోన్-1) ఆయకట్టు పరిధి వరకు , తర్వాతి ఎనిమిది రోజులు డిస్ట్రిబ్యూటరీ 53 కింది (జోన్-2)ఆయకట్టుకు ఈ విధంగా ఆన్, ఆఫ్ పద్ధతిలో సాగునీరు ఇవ్వనున్నట్టు తెలిపారు. గతేడాది కంటే ఈసారి ప్రాజెక్టులో నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున యాసంగి పంటకు బొటాబొటిగా సరిపోయే నీరు మాత్రమే ఉన్నందువలన ఆయకట్టు రైతులు విలువైన సాగునీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకొని నీటిపారుదల శాఖతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సారెస్పీలో 78.382 టీఎంసీ నీరు

ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (90.3 టీఎంసీలు) కాగా శనివారం ఉదయం 6 గంటల సమయంలో 1088.60 అడుగు (78.342 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1091 అడుగుల(90.313 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. అయితే గతేడాది కంటే ఈసారి నీటి సామర్థ్యం తక్కువగా ఉన్నందున.. సోమవారం నుంచి సాగుకోసం విడుదల చేస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు.


కాకతీయ కాలువ.. ఫైల్

ప్రీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థుల, అధ్యాపకుల సందడి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో ప్రీ - క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి. వెంకటేశ్వర రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రిస్మస్ పండుగ ప్రాశస్త్యాన్ని తెలిపారు. కళాశాల విద్యార్థులు స్కిట్స్, డాన్స్, గేమ్స్, పాటలతో, ఆద్యంతం కోలాహలంగా, సందడిగా సాగింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి. రేణుక, కల్చరల్ కోఆర్డినేటర్ ఆర్. ఉదయిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ అనుకూల సాగుపై అవగాహన


అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దూప్ సింగ్ తండా గ్రామంలో మగ్దంపుర్, గాలిపూర్, సింగీతం గిరిని తండా పిట్లం మండలంలోని బర్దపుర్ అల్లపుర్ గ్రామ రైతులకు పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను సాంకేతిక పై శిక్షణ కార్యక్రమం క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా మేనేజర్ వీరేశం మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ పద్ధతుల పైన అవగాహన కల్పించారు. రైతులు రసాయన పద్ధతులు తగ్గించి పర్యావరణ అనుకుల పద్ధతులు పాటించాలని సూచించారు. జీవ సంబంధిత ఎరువులు వాడడం వలన వాతావరణ కాలుష్యం జరగకుండా పంట అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయి అన్న అంశాలపై రైతులకు ఆయన వివరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఓవ్యక్తి చెరువులో ప్రమాదవశత్తు పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వినరాల ప్రకారం. లాడేగాం గ్రామానికి చెందిన కుర్మ ప్రసాద్ (43) కూలీ పని చేసుకుని కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 15వ తేదిన సాయంకాలం పొలం పనులు ముగించుకుని తిరిగి నస్తున్న క్రమంలో కాలకృత్యాలకు వెళ్తానని భార్యతో చెప్పి మీరు వెళ్లండని తెలిపాడు. ఉదయమైనా ఆయన తిరిగిరాకపోవడంతో చెరువు వద్ద పరిశీలించగా మృతదేహం కనిపించింది. ఊర చెరువులో ప్రమాదవశత్తు మృతిచెందాడు. మృతుని భార్య బాగులదేవి ఫిర్యాదు మేరకు కేసు నమేదు చేసి మృ దేహన్ని పోస్టుమాస్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారయణ తెలిపారు.


మృతిచెందిన ప్రసాద్

తండ్రిపై కొడుకుల దాడి

- అడ్డొచ్చిన సోదరిపై సైతం..
- ఆస్తి తగాదాలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-కామారెడ్డి/భిక్కనూర్

ఆస్తికోసం వావివరుసలను చూడకుండా కన్నతండ్రిపై, తోడబుట్టిన సోదరిపై దాడిచేసిన అమానవీయ ఘటన కామారెడ్డి జిల్లాలోని భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం ధాత్రిక విశ్వనాథంపై అతని కుమారులైన ధాత్రిక లింగం, ధాత్రిక రాములు రాముల పిల్లలు దాడి చేసినట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడిచేయడంతో తీవ్ర గాయాల స్పృహ కోల్పోవడంతో అతని కుమార్తెలు మంజుల, శోభాలు అతనిని కామారెడ్డి ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా విశ్వనాథం, మంజుల, శోభాలు మాట్లాడుతూ తనను తన పెద్ద కూతురైన శోభ చూడ్డానికి వచ్చిందని ఇది గమనించిన నా కుమారులు లింగం రాములలో అతని పిల్లలు వచ్చి ఇంట్లోకి వచ్చి తలుపులు మూసివేశారని దీంతో తనకు భయం వేసి నన్ను చంపడానికే వచ్చారని తలుపులు తీసుకొని బయటకు రాగా బయటకు వచ్చి రాయితో తలపై కొట్టారని అడ్డువచ్చిన తన కూతురు శోభపై సైతం దాడి చేసినట్టు తెలిపారు. పోలీసులకు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్పందించలేదని, గంట తర్వాత ఫోన్ లిఫ్ట్ చేసి ఏంటిది అని బెదిరించినట్టు మాట్లాడారని, చివరికి అంబులెన్స్ వచ్చిన తర్వాత వచ్చారన్నారు. ఆయన కూతురు మంజుల, శోభాలు మాట్లాడుతూ తమ తండ్రి అయిన విశ్వనాథం తమ సోదరులు పోషించకపోవడంతో తామే పోషిస్తున్నామని, దీంతో విశ్వనాథం పేరు పైన ఉన్న మూడు ఎకరాల భూమిని శోభా పేరుమీద, ఎకరా పది గుంటల భూమిని మంజుల పేరు మీద, మిగిలిన 20 గుంటల భూమిలోనుండి 10 గుంటలు లింగంకు, 10 గుంటలు రాములకు చేసి ఇచ్చారని దీని దృష్టిలో ఉంచుకొని వారు తపై పై దాడి చేశారన్నారు. వీరిపై పోలీసులు చర్యలు తీసుకొని తమ రక్షణ కల్పించారన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దాడి ఘటనను వివరిస్తున్న తండ్రి

అభివృద్ధిలో ఆలూర్ సొసైటీ

- చైర్మన్ తంబూరి శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆలూర్ పరిధిలోని దేగాం, మచ్చర్ల, ఇస్సపల్లి, గగ్గుపల్లి గ్రామాల రైతులకు సేవలను అందిస్తున్నట్టు చైర్మన్ తంబూరి శ్రీనివాస్ శనివారం తెలిపారు. గత కొద్ది నెలల క్రితమే చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన అంతకు ముందు పనిచేసిన చైర్మన్ కళ్లెం బోజారెడ్డి, వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్ సొసైటీల డైరెక్టర్లు, సీఈఓ మల్లేష్ సిబ్బంది ప్రతి ఒక్కరూ నిర్విరామ సేవలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో 22,420 బ్యాగుల యూరియా, 10,910 కాంప్లెక్స్ ఎరువులు అందజేసినట్టు తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్టు పంట రుణాలు సకాలంలో అందించడం, అవసరమైన దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు.

అయ్యప్ప దేవాలయంలో పూజలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అయ్యప్ప దేవాలయం యందు శనివారం గురు స్వామి నగేష్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించినారు. లింబాద్రి గురుస్వామి 18వ మాలాధారణ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో గురు స్వాములు వడ్ల శ్రీనివాస్, భోజన్న సుధా సీడ్స్ నితిన్, దత్తు, నలంద ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పైన బైకు టీవీఎస్ ఎక్సెల్ ఢీకొని పలువురికి తీవ్ర గాయాలు అయినట్టు ఎస్సై తిరుపతి శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం శనివారం మద్యాహ్నం జక్రంపల్లీ గ్రామం జాతీయ రహదారి 44 రోడ్ పైన చర్చికి ముందర నుంచి ఆర్మూర్ వైపుకు హెచ్ఎఫ్ డీలక్స్ బైక్ పైన వెళ్తున్న సురేష్ అను వ్యక్తికి, అర్గుల్ గ్రామం నుండి జక్రంపల్లి గ్రామానికి ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌పైన వస్తున్న పూజారి భూమన్న టక్కర్ ఇవ్వగా ఇరువురికి గాయాలు అయ్యాయి. వారందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో జక్రంపల్లి గ్రామానికి చెందిన పూజారి భూమన్న కూతురు తీవ్ర గాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్ష్యాధారాలు సేకరిస్తేనే శిక్ష

- పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌లకు అవగాహన కల్పించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేరస్తులకు తగిన శిక్ష పడేందుకు దానికి తగ్గ సాక్షాధారాలను సేకరించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశములో నేరస్తులకు శిక్ష పడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాక్షులను కోర్టులో హాజరు పరచకముందు కేసు గురించి క్లుప్తంగా తెలిపిన తర్వాతనే సాక్షాలు ఇస్తే ఖచ్చితంగా నేరస్తులకు శిక్షపడ టానికి వీలవుతుందని చెప్పారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని సూచిం చారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, రాజారెడ్డి, బంటు వసంత్, సంద రమేష్, జి. శ్యామ్రావు, కావేటి శేషు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఖాందేష్ శ్రీనివాస్, నిమ్మ దామోధర్ రెడ్డి, డాపి. సామయ్య, మహ్మద్ రహిముద్దిన్, డి. వీరయ్య, భూసారపు రాజేష్ గౌడ్, రాయక్, చిదిరాల రాణి, పొరిక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు

హామీలను నెరవేరుస్తా

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ఇందూరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సమాజ సేవకుడిగా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ప్రజల మనసులను గెలిచిన ఎమ్మెల్యేగా విజయం సాధించినట్టు తెలిపారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మెదటి సారిగా శనివారం నిజామాబాద్ నగరానికి విచ్చేసిన అర్బన్ ఎమ్మెల్యేకు అడుగడుగునా.. ఇందూర్ ప్రజలు ఘనస్వాగతం పలికారు. నగర ప్రాంత శివారులో అడుగుపెట్టగానే నిజామాబాద్ గడ్డని దండం పెట్టుకొని నగర అడుగుపెట్టారు. నగరం లోని మాధవ నగర్ సాయిబాబా ఆలయం, బోర్గం లోని లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వినాయక్ నగర్‌లోని అమరవీరుల పార్కులో అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పులంగ్ చౌరస్తా వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి దండం పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికి ఎమ్మెల్యేను సన్మానించారు. బోర్గాం బ్రిడ్జి వద్ద.. బిజెపి నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కమలం గుర్తుతో కాషాయ మయంగా ప్రత్యేకంగా అలంకరించిన బుల్లెట్ వాహనంపై ర్యాలీలో ఎంతో ఉత్సాహంగా ధన్‌పాల్ పాల్గొన్నారు. యువకులు కేరింతలతో బైక్ ర్యాలీలో నత్యాలు చేస్తూ సంబురంగా పాల్గొన్నారు. నగరంలోని గోల హనుమాన్ గాంధీ చౌక్ రైల్వే స్టేషన్ మీదుగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి చేరుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం చేరుకొని ఆయన మాట్లాడుతూ.. ర్యాలీలో పాల్గొన్న వారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. కానీవీని ఎరగని రీతిలో నగరాన్ని అభివద్ధి చేస్తానని అన్నారు.


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్


ప్రమాణస్వీకారం చేసి నిజామాబాద్‌కు వచ్చిన సందర్భంగా నేలకు దండం చేస్తున్న ధన్‌పాల్

ఉచిత రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పలువురు యువకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బోదెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామానికి చెందిన టీం 14 యూత్ అధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రాణదార బ్లడ్ సెంటర్ ఆర్మ్మార్ వారు ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 12 మంది యువకులు రక్త దానం చేశారని ఆర్గనైజేషన్ డాక్టర్ ప్రవీణ్, ప్రతాప్ తెలిపారు. రక్తం దానం చేయండి.. ప్రాణదాతలు కండి అంటూ వారు హితవు పలికారు. రక్తదానం చేసిన వారిలో సర్పంచ్ నోముల రవి, యువకులు కోట గోపాల్, రోహిత్, రంజిత్, దేవేందర్, శ్రీకాంత్, అనిల్‌కుమార్, హరీష్, గంగాధర్, వివేక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ పార్క్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలో గల కిడ్స్ పార్క్ స్కూల్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం రావుట్ల గ్రామంలో గల రాజరాజేశ్వర ఆలయాన్ని సందర్శించారు. అక్కడ స్కూల్ సిబ్బంది విద్యార్థులకు వినాయకునికి మొట్టమొదటి పూజ ఎందుకు చేస్తారో విద్యార్థులకు సూచించారు. అలాగే గుడిలో ప్రతిష్టాపించే ధ్వజస్తంభం, విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల చట్టాలను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-రెంజల్

కార్పొరేట్ అనుకూల చట్టాలను ఉపసంహరించుకోవాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని రాజధాని ఢిల్లీలో 13 నెలలుగా సాగిన రైతు పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ ఫైల్‌పై సంతకం చేశారని వారు పేర్కొన్నారు. ప్రస్తుతానికి చట్టాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం శోచనీయమని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి రైతులకు మేలు జరిగేలా చూడాలని వారన్నారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు పుట్టి నడిపి నాగన్న వడ్డెన్న, పార్వతి రాజేశ్వర్, ఎస్కే నసీర్, సంతోష్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) హైస్కూల్లో విద్యార్థులకు బాలల హక్కులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమ హక్కులను వివరించారు. అలాగే జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కులను వివరించి వాటిని ఏ విధంగా ఉపయోగించవచ్చొ తెలిపారు. ముఖ్యంగా సమాజంలో బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులపై బాలికలకు అవగాహన కల్పించారు. వాటి నుంచి ఏ విధంగా రక్షణ పొందాలి?, అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై పూర్తి అవగాహనను వారికి కల్పించారు. 1098 నెంబర్‌ని ఎలా ఉపయోగించాలి, దాని పనితీరు గురించి కూడా వారికి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్వాడీ టీచర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నల్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 56 మంది పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, బాల్కొండ లయన్స్ క్లబ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై భాస్కరాచారి, లయన్స్ క్లబ్ సభ్యులు సాగర్ రెడ్డి, చాకు లింగం, దినేష్ పటేల్, రాకేష్ చంద్ర, ఏఎస్సై గంగారాం, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నాయకుల పూజలు


పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండ ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్‌రెడ్డి గెలవాలని మొక్కుకున్నారు. ఎమ్మెల్యేగా వేముల గెలవడంతో అందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు భీంగల్‌లోని "శ్రీ లక్ష్మీ నరసింహస్వామి" ఆలయంలో శనివారం మొక్కును చెల్లించుకున్నారు. 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెంజర్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్, ముప్కాల్ వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రెంజర్ల ఉప సర్పంచ్ మగ్గిడి మోహన్ రెడ్డి, ఆకుల రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్ఐ సుశీల్‌కుమార్ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల గురించి, ట్రాఫిక్ నిబంధనల గురించి, సీసీటీవీ కెమెరాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్ రైస్‌మిల్లుల్లో

సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీలు

- సీఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వకపోవడంతో రూ.10కోట్ల జరిమానా
- అదీ చెల్లించని మాజీ ఎమ్మెల్యే


రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలంలోని తగ్గెలి గ్రామ సమీపంలో గల మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు సంబంధించిన రైస్ మిల్లులో గత మూడు రోజులుగా సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. శనివారం సైతం సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన సీఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వకపోవడంతో ప్రభుత్వం గత కొన్ని రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు సంబంధించిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా విధించింది. దానిని కూడా ఆయన చెల్లించకపోవడంతో గత మూడు రోజులుగా పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయనకు సంబంధించిన మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. 2021-22 సంవత్సరానికి సంబంధించిన యాసంగి ధాన్యం, 2022-23 సంవత్సరానికి చెందిన వర్షాకాలం ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు షకీల్ ఆమేర్‌కు సంబంధించిన మిల్లుకు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. ఇందులో 35 వేల మెట్రిక్ టన్నుల కష్టమ్ బియ్యం పౌరసరఫరాల శాఖకు తిరిగి చెల్లించాలి. కానీ 35000 మెట్రిక్ టన్నులకు బదులు ఐదు వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఆయన తిరిగి ఇచ్చినట్లు అధికారులు చెబుతు న్నారు. మిగిలిన ధాన్యం సీఎంఆర్ బియ్యంగా మార్చి ఇవ్వడం తనకు సాధ్యపడనట్లు షకీల్ అధికారులకు తెలిపినట్లు సమాచారం. దాంతో 4 ఇండస్ట్రీలకు ఆయన ధాన్యాన్ని ఇచ్చినట్లు మిల్లర్లు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినట్లు సమాచారం. ఆయా మిల్లర్ల నుంచి కేవలం 4000 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించారు. దాంతో మిగిలిన 26వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలని అధికారులు ఆ నాలుగు మిల్లర్లకు అడగగా తమకు షకీల్‌కు సంబంధించిన మిల్లుల నుంచి ఎలాంటి ధాన్యం రాలేదని ఆయన ఒత్తిడి మేరకే తాము ధాన్యం తీసుకున్నట్లు రాసిచ్చి నట్లు వారు తెలిపినట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ప్రభుత్వానికి చెల్లించ వలసిన సీఎంఆర్ బియ్యం విలువ సుమారు 60 కోట్ల రూపాయలు ఉంటుందని సమా చారం. దాంతో ఆయనకు 10 కోట్ల రూపా యల జరిమానా విధించినట్లు సమాచారం. ఆయిన కూడా షకీల్ 10 కోట్ల రూపాయల జరిమాన కూడా ప్రభుత్వానికి చెల్లించక పోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయన మిల్లులలో తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల సందర్భంగా అధికారులు మాట్లా డుతూ సాధారణ తనిఖీలలో భాగంగా ఈ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఈ రైస్ మిల్లులో తనిఖీలలో భాగంగా మిగిలిన ధాన్యం డిఎస్ఓ ఆదేశాల మేరకు ఇతర రైస్ మిల్లులకు బదిలీ చేస్తున్నామని, మిగిలిన బియ్యాన్ని పిడిఎస్ బియ్యంలో భాగంగా స్వాధీనం చేసుకున్నామని, దానిని పిడిఎస్ బియ్యం పరిశీలన కోసం సివిల్ సప్లై తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. అలాగే మిగిలిన రైస్ మిల్లులలో తనిఖీలు చేపట్టి తదుపరి చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలను మరో రెండు రోజులపాటు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో డిసిఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లై డిఎం జగదీష్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారి శ్రీధర్‌రెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్‌రాజ్ పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా ఉండాలి

- చట్టాలను గౌరవించాలి
- నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- ట్రాఫిక్‌పై అవగాహనా సదస్సు


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని, చట్టాలను గౌరవించి వాటిని పాటించి, తమను నమ్ముకున్న తల్లిదండ్రులకు గర్భశోకం రాకుండా చూడాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సునీత కుంచాల హాజరై మాట్లాడుతూ.. యువతే దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత రోడ్డు ప్రమాదాల బారిన పడి మంచి భవిష్యత్తును కోల్పోకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలే ప్రధానమని అన్నారు. వాహనాదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నుండి దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మన దేశంలో జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ సరైన విధంగా లేదని, కావున మనం అభివృద్ధి చెందిన దేశంలాగా ఉండాలంటే యువత క్రమశిక్షణగా.. ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పకుండా అనుసరించాలని అన్నారు. ఈ సందర్భంగా అదనపు డిప్యూటి కమిషనర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచి, చదివించి, పెద్దవారిని చేసిన తర్వాత చేతికి వచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఎంత మనోవేదనకు గురవుతుందో క్షుణ్ణంగా తెలిపారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా తగుచర్యలు తీసుకుంటామని, అన్ని కాలేజీలలో ట్రాఫిక్ రూల్స్‌పై చైతన్యవంతం అయ్యేవిధంగా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ట్రాఫిక్ ఎ.సి.పి. నారాయణ మాట్లాడుతూ.. దేశంలో ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న కారణంగా దేశానికి కావలసిన యువత మరణాలకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ.. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడిపితే, ప్రమాదాలకు దూరంగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా సిగ్నల్ జంప్, ట్రిబుల్ రైడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, తదితర హెల్మెట్ లేని వారు ఎలా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్న విషయాలపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు జడ్జి పద్మావతి, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ఎస్.జయిరామ్, ట్రాఫిక్ ఎ.సి.పి టి.నారాయణ, సి.సి.ఆర్.బి ఎ.సి.పి రవీందర్‌రెడ్డి, మేఘన డెంటల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.ప్రతాప్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ అంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, మేఘన డెంటల్ కాలేజీ, ఇన్ఫినిటి ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ ఎస్.ఎస్.ఆర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ సిబ్బంది. ఐ.టి.కోర్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన సదస్సుకు హాజరైన యువకులు

ఆటల పోటీలు


ఆటల పోటీల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో మహిళలకు సిఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో ఇండోర్ ఆటల పోటీలను జిల్లా గౌరవ అధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 19న పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా శని, ఆదివారాలలో వివిధ ఆటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇండోర్ ఆటలు చేస్, క్యారం, ఫాస్ట్ వాక్, బాల్ గేమ్, స్కిల్ గేమ్, యోగ డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. పెన్షనర్లందరూ ఉత్సాహంగా ఆటలలో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ఈ ఆటలలో గెలిచిన వారికి డిసెంబర్ 19న న్యూ అంబేద్కర్ భవన్లో జరిగే పెన్షనర్ డే దినోత్సవ సందర్భంగా ప్రథమ, ద్వితీయ పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధం మదన్మోహన్, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు హనుమాన్లు, నగర కార్యదర్శి అందే సాయిలు, ప్రసాద్‌రావు, లావు వీరయ్య, దీకొండ లక్ష్మీనారాయణ, సిర్ప లింగం, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే భూపతిరెడ్డి పర్యటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్‌వాయి మండలంలోని గుడితండాలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్ శనివారం తెలిపారు. ఇందల్‌వాయి మండలంలోని గుడితాండాలో గత కొన్ని రోజుల క్రితం అగ్ని ప్రమాదంతో నిర్వాసితులైన బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని వివరించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

జీవనోపాధికి శిక్షణ ఎంతో అవసరం


శిక్షణ పూర్తయిన అభ్యర్థులతో అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జీవనోపాధి కోసం శిక్షణ ఎంతో అవసరమని, ఇలాంటి శిక్షణతో తమ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలుస్తు న్నారని, జీవితంలో స్థిరపడటానికి ఎంతగానో దోహదపడుతుందని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ఘన్‌పూ శివారులోని ఎస్బిఐ ట్రైజం ట్రైనింగ్ సెంటర్ అర్ఎస్ ఈటిఐలో నిర్వహించిన ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ ట్రైనింగ్ శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిచ్‌పల్లి బ్యాంకు మేనేజర్ శ్యాంసన్ పాల్గొని శిక్షణ పొందిన శిక్షకులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని సద్వినియోగం చేసుకోవాలని, తమ అవసరాల మేరకు బ్యాంక్ ద్వారా రుణాలను సమీపంలో ఉన్న బ్రాంచ్‌లో కలిసి రుణాలు పొందాలని, ఏదైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పుప్పాలపల్లిలో వికసిత భారత్ సంకల్పయాత్ర


సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన సంకల్పం వికాసిత భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నరేంద్రమోడీ చేపట్టిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలను పథకాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రానికి ఎటువంటి పౌష్టికాహారం అందుతుందో దాని గురించి వివరించారు. మండల వైద్య సిబ్బంది ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. వ్యవసాయం కాంప్లెక్స్ ఎరువులపై, యూరియాపై ఎంత సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా దిశా కమిటీ సభ్యుడు చందమియబాగ్ సర్పంచ్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. ఎవరు కూడా ఉచితాలకు అలవాటు పడకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ప్రధానమంత్రి యువజన పథకాలను వినియోగించుకొని అందరూ అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం, సర్పంచ్ దావుల పోసాని, ఏపిఎం రవీందర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు లిటిల్ ఫ్లవర్ విద్యార్థినులు

నవతెలంగాణ-నవీపేట్

ఎస్జీఎఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని తాడ్‌బిలోలిలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ అండ్ సెలెక్షన్స్‌లో మండల కేంద్రానికి చెందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థినిలు అత్యున్నత ప్రదర్శన కనబర్చడంతో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నిత్యారెడ్డి, లాస్య రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పిఈటీ ఉపాధ్యాయులను కరస్పాండెంట్ హన్మాండ్లు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.


రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లైబ్రరీకి అంబేద్కర్ వాక్ మూవ్ గ్రంథాలు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సంపూర్ణ వాక్ మూవ్ అనే హిందీ భాషా గ్రంథ ఖండికలను హిందీ విభాగ పి.హెచ్.డి పరిశోధక విద్యార్థి ప్రకాష్ టీయూ లైబ్రరీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ వర్సిటీ సెంటర్ లైబ్రరీకి అత్యంత విలువైన ఈ గ్రంథాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ గ్రంథాలు హిందీభాషా అధ్యాపకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు రిఫరెన్స్ గ్రంథాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హిందీ విభాగ అధ్యక్షుడు డాక్టర్ ఎండి జమీల్, పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ బి.సాయిలు, గ్రంథాలను అందించిన ప్రదాత ప్రకాష్ పాల్గొన్నారు.